క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అక్షయ తృతీయ పూజలు



పాండురంగ స్వామికి నీరాజనాలు సమర్పిస్తున్న అర్చకుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న శ్రీ పాండురంగ స్వామి ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు స్వామి వారి నిజరూప దర్శనం కల్పించారు. స్వామి వారికి చందన అలంకరణ చేశారు. అర్చకులు దండిభొట్ల కనక సుందర శర్మ భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. స్వామి వారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వడదెబ్బ మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ పనిచేస్తూ చనిపోయిన పెంకి వెంకన్న కుటుంబానికి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం జీవరత్నం, పి.రామకృష్ణలు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కుక్కునూరు గ్రామంలో పెంకి వెంకన్న వడదెబ్బ తగిలి చనిపోయాడని తెలిపారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

జనగణనకు ఆమోదం హర్షణీయం

ఏలూరు (టూటౌన్): 2026లో జనాభా లెక్కల సేకరణతో పాటు కులగణన నిర్వహించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించటం హర్షణీయమని కాపు సంక్షేమ సేవాసంఘం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడు పులి శ్రీరాములు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కులగణనలో వాస్తవిక లెక్కలు తెలుస్తాయని, తద్వారా ఆయా వర్గాలకు రాజ్యాంగ పరమైన హక్కుల సాధనతో పాటుగా, ప్రభుత్వ పథకాలు మరింత పారదర్శకంగా అందే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రూ.1.01 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు దెందులూరు మండలం పెరుగుగూడెంకు చెందిన రాయపాటి సీతామహాలక్ష్మి బుధవారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేయగా, ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాన్ని దాతకు అందించారు.

ఏలూరు రైల్వే స్టేషన్‌కు కొత్త హంగులు

- రూ.21.10 కోట్లతో అభివృద్ధి
- శరవేగంగా పనులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో ఒక్కటైన ఏలూరు రైల్వేస్టేషన్ కొత్త హంగులను సంతరించుకుంటోంది. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఏలూరు స్టేషన్‌ను ఎంపిక చేశారు. ఏలూరు స్టేషన్ అభివృద్ధికి రూ.21.10 కోట్లు కేటాయించారు. గతేడాది ఆగస్టు నుంచి అమృత్ భారత్ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఈ స్టేషన్ నుంచి ప్రతి రోజూ 61 రైలు సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. సగటున రోజుకు ఆరు వేల మంది వరకు ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. మెట్ట ప్రాంతంలోని వాణిజ్య పంటలకు, ఆక్వా ఉత్పత్తులకు, లెవీ బియ్యం ఎగుమతికి ఏలూరు రైల్వే స్టేషన్ అనువుగా ఉండటంతో ఇక్కడి నుంచి ఎగుమతి, దిగుమతులతో పాటు, ప్రయాణికుల రాకపోకలు అధికమని అధికారులు చెబుతున్నారు.

అందుబాటులోకి రానున్న పలు సౌకర్యాలు

దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఏలూరు రైల్వే స్టేషన్ ప్రధానద్వారంతో పాటు ప్రాంగణం, ట్రాఫిక్ వసతులు, వెయిటింగ్ గదులు, ప్రయాణికులకు అనువుగా ఉండే సమాచార సూచికలు వృద్ధి చేయనున్నారు. దీంతో ఉత్తమ శ్రేణి రైల్వే స్టేషన్‌గా ఏలూరు స్టేషన్ రూపాంతరం చెందనుంది. గత ఎనిమిది నెలలుగా స్టేసన్ అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తి కానున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రయాణికుల హర్షం

ఏలూరు స్టేషన్ అభివృద్ధి చేస్తుడటం పట్ల రైల్వే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు స్టేషన్ భౌగోళికంగా ఇటు మెట్ట, అటు డెల్టా ప్రాంతాలకు కీలక కేంద్రంగా ఉంది. ఆక్వా, వరి, ఉద్యాన, వాణిజ్య పంటల ఎగుమతులు ఎక్కువగా జరుగుతుంటాయి. వందే భారత్ లాంటి రైలును ఏలూరులో హాల్ట్ ఇవ్వడాన్ని ప్రయాణికులు హర్షిస్తున్నారు. అన్ని రైళ్లను ఏలూరులో ఆపడంతో పాటు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరిస్తే మరింత సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు.



ఏలూరు రైల్వే స్టేషన్ ప్రవేశ మార్గం పనులు చేపట్టిన దృశ్యం




ప్లాట్‌ఫారంపై ఏర్పాటుచేసిన తాగునీటి కుళాయి



టిక్కెట్ కౌంటర్, వెయిటింగ్ హాల్ బిల్డింగ్

అభివృద్ధితో అదనపు ఆదాయం



ఏలూరు రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకంలో అభివృద్ధి చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఎక్కువగా ఉంది. స్థానిక ప్రజలు, వ్యాపారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరిస్తే ప్రయాణికులకు మరింత సౌకర్యంగా ఉంటుంది. ఏలూరు స్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు.

– నాగం శివ, డీయూఆర్‌సీసీ మాజీ సభ్యులు, ఏలూరు

మారనున్న రైల్వే స్టేషన్ రూపురేఖలు



ఏలూరు స్టేషన్‌లో ఇప్పటికే ప్లాట్ ఫారం అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. స్టేషన్ ముఖద్వారం, పార్కింగ్ ప్రాంతం అభివృద్ధి పనులు చేస్తున్నారు. రిజర్వేషన్, వెయిటింగ్ హాలు తదితర సౌకర్యాలతో కొత్త బిల్డింగ్ నిర్మించారు. ప్రయాణికులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా రైల్వే శాఖ చర్యలు తీసుకుంది. అభివృద్ధి పనులు పూర్తయితే ఏలూరు స్టేషన్ రూపు రేఖలు మారిపోనున్నాయి.

– ఎస్‌వీ రమేష్, రైల్వే స్టేషన్ మేనేజర్, ఏలూరు

5 నుంచి ఉద్యమ కార్యాచరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వం పాఠశాలలను 9 రకాలుగా వర్గీకరిస్తోందని, ఈ అసంబద్ధ వర్గీకరణకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ ఉద్యమ పదంలో పయనించడానికి సిద్ధమౌతోందని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డి దొర ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి వేరువేరుగా ఉంటుందని, ఇటువంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని, 12వ పీఆర్‌సీ కమీషన్‌ను ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. 11వ పీఆర్‌సీ ఆర్థిక బకాయిలతో పాటు అన్ని రకాల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సంఘం మూడు అంచెల ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందని తెలిపారు. ఇందులో భాగంగా మే 5న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని, మే 9న జిల్లా కేంద్రాల్లో ధర్నా, మే 14న విజయవాడలో రాష్ట్ర స్థాయిలో ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంల్లో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజధానికి శంకుస్థాపనలు ఎన్నిసార్లు?

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర రాజధానికి ఎన్నిసార్లు శంకుస్థాపనలు చేస్తారని, శంకుస్థాపనకు ప్రధాని మోదీ రావడం మరీ హాస్యాస్పదంగా ఉందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు ఎద్దేవా చేశారు. బూటకపు శంకుస్థాపనకు ప్రధాని వస్తున్న సందర్భంగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

విజ్ఞానం పెంచుకోవాలి



వేసవి విజ్ఞాన శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం మూడో రోజు కార్యక్రమాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్ బాబు ప్రారంభించారు. విద్యార్థులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ సమయాన్ని సెల్‌ఫోన్‌లు, టీవీలు చూసుకుంటు వృథా చేసుకోవద్దని అన్నారు. తరచు గ్రంథాలయానికి వచ్చి కథలు, కథనాలు, డ్రాయింగ్, జనరల్ నాలెడ్జ్‌ను పెంచుకొని మంచి విజ్ఞానవంతులుగా, భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలని ఈ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ చూపి బహుమతులు గెలుచుకోవాలని సూచించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ పి.శంకర్ డ్రాయింగ్ తరగతులు కొనసాగించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, ఎండీ. అస్లాంపాషా, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పేదోడి ఫ్రిజ్ రెడీ

మట్టి కుండలో నీరు చల్ల ఉండి, ఆరోగ్యకరమని పెద్దలు చెబుతారు. ఫ్రిజ్‌లు, వాటర్ ప్యూరీఫైర్ల రాకతో మట్టి కుండలు కనుమరుగవుతున్నాయి. ఐతే, మధ్య, పేద ప్రజలు చాలా వరకు మట్టి కుండలో నీరే తాగుతుంటారు. వేసవి ప్రారంభం కావడంతో వినియోగదారులను ఆకర్షించే విధంగా మట్టి కుండలు, కూజాలు, వాటర్ బాటిళ్లకు రంగులు వేసి, రకాన్ని బట్టి రూ.200 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ఏలూరు ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలివీ..


– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు











కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	34	బీన్సచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	34	చామదుంపలు	54
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	36	కంద	--
కాకర కాయలు	30	బీట్‌రూట్	28
బీరకాయలు	30-38	కీరా దోస	38
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
అనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఏలూరులో ట్రాఫికర్

పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా ఏలూరు నగరంలో రోడ్ల విస్తరణ లేకపోవడం, ఉన్న రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఇష్టానుసారంగా వ్యాపారాలు నిర్వహిస్తుండడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో వాహనచోదకులు తరచూ ప్రధాన రోడ్లపై సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో జడ్జీల గృహ సముదాయం నుంచి కొత్త బస్టాండ్ వైపు, ఒంటిగంట సమయంలో సీఆర్ఆర్ కాలేజీ వద్ద పూర్తిగా ట్రాఫిక్ జామైన దృశ్యాలివీ.

– ఏలూరు (టూటౌన్)



సీఆర్ఆర్ కాలేజీ వద్ద పూర్తిగా జామ్ అయిన ట్రాఫిక్



జడ్జీల గృహ సముదాయం నుంచి కొత్త బస్టాండ్ వైపు మెయిన్‌రోడ్డుపై ట్రాఫిక్

విద్యుత్ షాక్‌తో యువకునికి గాయాలు



యువకుడిని పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

ఏలూరు రూరల్ : ఏలూరు ఇండోర్‌స్టేడియం వద్ద బుధవారం విద్యుత్ షాక్‌తో యువకుడు గాయాలపాలయ్యాడు. దెందులూరుకు చెందిన ప్రదీప్ ఏలూరులోని ప్రైవేటు కళాశాలలో చదువుకుంటున్నాడు. ఉదయం 10 గంటల సమయంలో స్నేహితులతో కలిసి ఏలూరు ఇండోర్ స్టేడియానికి వచ్చాడు. స్టేడియం గేట్లు మూసి ఉండడంతో గోడ దూకి లోపలికి ప్రవేశించాడు. ఆ సమయంలో చెప్పులు పడిపోవడంతో స్నేహితులు చెప్పులు లోపలకు విసిరారు. ఆ చెప్పులు పట్టుకునేందుకు ప్రయత్నించిన ప్రదీప్ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలపై పడ్డాడు. దీంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్ని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆసుపత్రికి వెళ్లి బాధితుడును పరామర్శించారు. విద్యార్థులు క్లాసులకు వెళ్లకుండా స్టేడియ మూసివేసినప్పటికీ లోపలకి దూకి ఆటలాడుతున్నారని తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	18
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	12
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	25

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	12
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	11
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో స్థానికేతరులకే ప్రాధాన్యత

రంగాపురంలో భాగవత సదనం అసంతృప్తి



ఆలయంలో సంకీర్తన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న కళాకారులు

లింగపాలెం: ద్వారకాతిరుమల దత్తత ఆలయమైన లింగపాలెం మండలం రంగాపురం శ్రీ భూ నీళా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు మే 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఆరు రోజుల పాటు నిర్వహించే భక్తి కళా కార్యక్రమాలకు వివిధ భక్తి కళారూపాల వారు ముందే దరఖాస్తు చేసుకుంటారు. ఈ కార్యక్రమాల కేటాయింపులో స్థానికులను కాదని మొత్తం ఆరు రోజుల్లో ఐదు రోజుల కార్యక్రమాలను దూరప్రాంతాలకు చెందిన వారికే కేటాయించారు. దీంతో స్థానిక భక్తి ఆధ్యాత్మిక సేవ సంస్థ అయిన భాగవత సదనం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. బుధవారం ఆలయంలో సంకీర్తన చేస్తూ శాంతియుత నిరసన తెలిపింది.

పక్షపాత వైఖరి సరికాదు

ఈ సందర్భంగా భాగవత సదనం ఆచార్యులు శ్రీమాన్ తిరుక్కోవళ్లూరి శ్రీనివాస పెరుమాళ్ మాట్లాడుతూ లింగపాలెం మండలం ఎంతోమంది భక్తులు, భాగవతులు, కళాకారులకు నెలవై ఉందని, తమ సంస్థలోనే సుమారు 200 మంది సభ్యులు సంకీర్తన, నృత్యం, విష్ణు సహస్రనామ స్తోత్రాది పారాయణాలు, ప్రవచనం, గ్రామసంకీర్తన, కోలాటం, కూచిపూడి మొదలైన భక్తి మార్గాలలో అనేక గ్రామాల్లో భక్తి ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతూ, సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాంటి ఈ ప్రాంతంలో స్థానికులకు ఒక్కరోజే అవకాశమిచ్చి, మిగతా రోజులన్నీ విజయవాడ, పూళ్ల లాంటి స్థానికేతరులకు అవకాశం ఇవ్వడం సరికాని అన్నారు. ద్వారకాతిరుమల దత్తత ఆలయమైనంత మాత్రాన ద్వారకాతిరుమల వాళ్లకే రెండు రోజుల కార్యక్రమాలు రాయడం దేవస్థాన పక్షపాత వైఖరికి నిదర్శనమని తెలిపారు. దశాబ్దాలుగా స్వామివారిని నిత్యం సేవించుకుంటూ, సొంత ఖర్చులతో సంవత్సరం పొడవునా వివిధ కైంకర్యాలు చేసుకునేది తామేనని వివరించారు. స్థానికేతరులకు కార్యక్రమాలు ఇచ్చినప్పటికీ, కనీసం సగం కార్యక్రమాలైనా స్థానిక భాగవతులకు కేటయించడం ధర్మమని అన్నారు. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాల వల్ల ఆలయ వ్యవస్థపై ఉన్న గౌరవం, విశ్వాసం సన్నగిల్లుతుందని తెలిపారు. ఈ వివక్షను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అన్నారు.